# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1) **విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ప్రమాద బాధితులను పరామర్శించిన కేంద్రమంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు.**

2) **విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చిన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.**

3) **ఆక్వా రైతుల సంక్షేమం, ఆక్వారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.**

4) **యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తోందన్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.**

==========================

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు పరామర్శించారు. ఆసుపత్రిని సందర్శించిన ఆయన, క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ కల్యాణ్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

ఘటనలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు పరామర్శించారు. విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి చేరుకున్న బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రమాద ఘటనపై నియమించిన కమిటీ నివేదిక అందిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అలాగే కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఈరోజు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

-------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో 10, 11, 12వ స్నాతకోత్సవ కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ పలువురు విద్యార్థినీ, విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన స్నాతకోత్సవ సభను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు జ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి వినియోగించాలని, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని గవర్నర్ సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటూ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పాలన వ్యవస్థ బలోపేతంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే ఈ సమీక్షలో తొలుత ఈ మధ్యాహ్నం రాష్ట్ర స్థూల ఉత్పత్తి –జీఎస్‌డీపీపై సమీక్ష నిర్వహిస్తారు. ఆర్థిక వృద్ధి, అభివృద్ధి సూచికలపై సంబంధిత అధికారులతో చర్చించనున్నారు. సాయంత్రం రియల్ టైమ్ గవర్నెన్స్– ఆర్టీజీఎస్ వ్యవస్థ పనితీరు, అమలుపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం వెంకటరాయునిగూడెం గ్రామంలో 10 కోట్ల 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు కేంద్ర మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని అన్నారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ పార్కులు దోహదపడతాయని పేర్కొన్నారు.

---------------------------

ఆక్వా రైతుల సంక్షేమం, ఆక్వారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆక్వా రైతులు, మేత తయారీ సంస్థల ప్రతినిధులతో విజయవాడలో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రొయ్యల మేత ధరల అంశంపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారానికి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానం ఉండాలని, పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

అంత్యోదయ స్ఫూర్తితో "గరీబ్ కళ్యాణ్" లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో దేశంలో సంక్షేమ పంపిణీ వ్యవస్థపై ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు స్పందిస్తూ, "చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలి" అనే లక్ష్యంతో కేంద్రం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. జన్ ధన్ యోజన ద్వారా బ్యాంకింగ్

సేవల విస్తరణ, ఉజ్వల యోజన కింద ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుధ్య మెరుగుదల, పీఎం ఆవాస్ యోజన ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణం, అలాగే ప్రత్యక్ష నగదు బదిలీ–ఐదీ విధానం ద్వారా పారదర్శక సంక్షేమ పథకాల పంపిణీ జరుగుతోందని తెలిపారు.

-------------------------

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హ్యూమన్ పాపిల్లోమా వైరస్ –హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని మరో మూడు నెలల పాటు కొనసాగించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు చేపట్టిన ఈ ప్రత్యేక టీకా కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో 14 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల 2 లక్షల 71 వేల మందికి పైగా బాలికలకు ఇప్పటికే హెచ్‌పీవీ టీకాలు అందించినట్లు తెలిపారు. బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ సూచించారు.

-------------------------

ప్రజలందరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. యోగాంధ్ర–2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ ఈరోజు యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర, ఆరోగ్యాంధ్ర లక్ష్యాలతో రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. యోగాభ్యాసం ద్వారా ఒత్తిడి తగ్గి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ సుజనా వెల్లడించారు. ముఖ్యంగా సింగపూర్ నుంచి విజయవాడ విమానాశ్రయానికి చేరుకునే ప్రయాణికులకు వారానికి మూడు సార్లు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

=====================